# పాపాయి తల్లి

పి. వి. తాతాచారిగారు
ఐ. యస్. సి.

ఏవమ్మా! పిల్లలెందరు? అని అడిగింది నీలాటిరేవులో నీళ్ళకోసం వచ్చి ఓ యిల్లాలు. దానికి జవాబుగా కంట తడిపెట్టింది సుశీల!

ఆనాడు పెద్దపండుగ. 'భోగిపండ్లు మా అబ్బాయికి పోస్తాం. పేరంటానికి రండి వదినగారూ!' అంటూ ఎందరెందరో వచ్చి పిలిచేరు. ఆ పిలుపువిని, 'గొడ్రాలా! నువ్వు రాబట్టే ముద్దుముచ్చట తీర్చుకోలేక పోతున్నాను. చూడు! ఆ అమ్మాయి రత్నం యెటువంటి అబ్బాయిని కందో! ముద్దుల మూట కడుతున్నాడు! ఆ పొరుగావిడచూడు! అవధాన్లగారి పెద్దమ్మాయి వసుమతిచూడు! ఆచార్లగారి పిల్ల సరస్వతిచూడు! గుమ్మడిపండ్లలాంటి కుఱ్ఱాళ్ళను మోసుకొచ్చేరు పుట్టింటికి. నా గ్రహచారం కొద్దీ నాకు కోడలవయావు' అని నోటికివచ్చిన మాటల నింకెన్నో అంది. దానికి, కన్నుల నీరునింపుకొని "పిల్లలు కలగక పోవడానికి నేనాకర్తను అత్తయ్యా!" అని విచారవదనంతో అనేది సుశీల!

ఆనాడు పండగకదూ! ఎక్కేగుమ్మం దిగేగుమ్మం. 'ఏమండీ! అక్కయ్యగారూ! ఎందరు పిల్లలు?' అని అడిగేది ఓ గృహిణి. 'పిల్లలు లేరమ్మా! అని చెప్పలేక చెప్పేది సుశీల. 'అప్పుడే ఆరేండ్లయ్యింది కాపరానికివచ్చి ఇంకా పిల్లలులేరా!' అని అనేది ఓ యింట్లో పేరంటానికి వచ్చిన వారిలో యొకర్తె. ఆ మాటలు శూలంలాగ హృదయంలో గ్రుచ్చుకొనేవి పాపం! సుశీలకు. దాంతోపాటు బొటబొటమని కన్నీరు కంటికి మంటికి ధారగా కార్చేది. 'ఫరవాలేదమ్మా! పుడతారు. భగవంతు డియ్యాలి గాని మనలో యేముంది చూడు! మా అత్తగారి మేనత్తకూతురికి యిలాగే పదేళ్ళయిందాకా పిల్లలు కలగలేదు. రెండేళ్ళక్రిందటే ఓ శిశువును కంది. అని ఓ యిల్లాలనేది. 'అయితే, నాకూ అలాగే పుడతారు కాబోలు!' అని తన మనస్సును సమాధాన పర్చుకొనేది ఆ అమాయకురాలు సుశీల.

ఈ విధంగా అందరి యిండ్లలోనూ యిదేమాట! పాపం! ఏంచెయ్యగలదు? సుశీల.

మాటిమాటికి యేదో సందు కల్పించుకొని రోజుకు అధమం వందసార్లయినా 'గొడ్రాలా! బాగ దాపరించేవు నాకొడుక్కి' అని యొకసారనేది. 'చూడు! నాకొడుక్కి మరోపెండ్లిచేస్తా' ననేది యింకోసారి సుశీల అత్తగారు. లాలించి పాలించి ప్రేమించి వీడు నా కొడుకనుకొని చంకనుంచుకొని ముద్దుముచ్చటలను చూస్తూ ఆనందించే 'పాపాయి తల్లి' కానప్పుడు సుశీల అత్తగారికి ఏం సమాధానం చెప్పగలదు?

'ఏమండీ! చూసారా! నలుగురు ఏమంటున్నారో నేను గొడ్రాలనట. మరి పిల్లలు పుట్టరట. గ్రహచారం కొద్దీ నాకు కోడలవయా వంటున్నారు అత్తగారు. దీనికి నేనా కర్తను? ఇది నాలోపమా? చెప్పండి! మీరయినా కాదని ఒక్కసారి నోరార నా ముఖంచూసి చెప్పండి!' అని కన్నీటి కాల్వలను ప్రవహింప జేస్తూ వలవల యేడ్చింది సుశీల భర్తదగ్గర. 'కాదు సుశీలా! నువ్వెలా అవుతావు? ఏడువకు. భగవంతు డనుగ్రహిస్తాడు. అందరికంటె మంచి అబ్బాయిని కంటావు.' అని ఓదార్చేడు సుశీలను.

పూర్వజన్మ సుకృత ఫలమో? లేక భగవంతుని కృపయో? అదీ కానియెడల భర్త ఆశీర్వాద ఫలితమో? కాని సుశీల యిప్పుడు అయిదు మాసాల గర్భిణి.

నేనూ ఓ పాపాయి తల్లినని చెప్పవచ్చునని గర్వించేది సుశీల! 'గొడ్రాలా' అని అత్తయ్య అంటే, కాదు. నేను గొడ్రాలను కాను. నాకూ ఓ అబ్బాయున్నాడు అని చెప్పవచ్చుననుకొనేది సుశీల! 'ఎందరు పిల్లలు?' అని యెవ్వరయినా ప్రశ్నిస్తే, 'ఓ అబ్బాయండీ!' అని గర్వంతో చెప్పవచ్చుననుకొని తన భవిష్యత్తును చూచి పరమానంద భరితురాలయ్యేది సుశీల!

మరి నాల్గుమాసాలు గడిచేయి. సుశీల నిండుచూలాలు. నేడో రేపో అందాలకు నిధియయిన అబ్బాయిని కంటుంది. ముచ్చటదీర ముద్దాడుతుంది. అందరిని పేరంటానికి పిలుస్తుంది. అని తనభావి భాగ్యాన్ని మరింత భాగ్యవంతంగా చేసుకొనేది సుశీల! ఏనాడూలేని సంతోషం తెచ్చుకుంది. ఇంకేముంది? శిశువు బయటపడ్డాడు. సుశీల ఆనందానికి మేరలేదు. అత్తగారి సంతోషానికి తెంపులేదు. ఆ వీధిలో అందరూ చెప్పుకుంటున్నారు. ఏమని? "మన సుశీల ఓ మగశిశువును కందే!" అని.

పురిట్లో పెద్ద జబ్బుచేసింది సుశీలకు. బ్రతుకుతుందో లేదో అన్నట్లుంది. "కాను! నేను గొడ్రాలను కాను! నాచేతిలో ఓ పాపాయి వుంటే గొడ్రాల నెలా అవుతాను?" అని సుశీల పలువరించేది. "ఇన్నాళ్ళవలె కాదు! మీ అందరిలాగ నేనూ ఓ పాపాయి తల్లినే! నా గొడ్రాలితనాన్ని నాపాపాయి పటాపంచలు చేసేడు! నన్నీదినంనుండి 'గొడ్రాలా!' అని పిలవకండి! 'పాపాయి తల్లీ!' అని పిలవండి! అని అనేది మధ్యమధ్య త్రుళ్లిపడిలేస్తూ సుశీల జ్వరంలో. జ్వరం యెక్కువయింది.

పాపం! యిన్నాళ్లు తల్లికి పాపాయిలేదు! ఇప్పుడో కాలం తలక్రిందులయింది. పాపాయికి తల్లి లేదు!!!





జండుబాలామృతము

క్షీణించి అనారోగ్యవంతులుగా నుండు బిడ్డలకిది యమృతమువంటిది. వారికి ఆకలిని వృద్ధిపరచి ఆరోగ్యము నిచ్చును.

పిల్లలకు దంతములు మొలుచునప్పుడు కలుగు నొప్పులను పోగొట్టును. కాళ్లుచేతులు శుష్కించి కడుపు పెద్దదిగా నున్న బిడ్డలకిది దివ్యౌషధము. జీర్ణించిన జలుబు, దగ్గు మొదలగు వాటినికూడ నివారించును.

బుడ్డి ఒకటికి రూ. 1-2-0.

రాజా అండుకో., నంద్యాల.
దుర్గా మెడికల్ స్టోర్సు, కావలి
రావు మెడికల్ స్టోర్సు, పాలకొల్లు
రాధాకృష్ణా మెడికల్ స్టోరు, నరసపూరు

పి. సీతారామయ్యా, ఎలమంచిలి
కుసుమంచి అప్పలరాజు, అనకాపల్లి
సీలం & కో., విశాఖపట్టణం.
దుర్గ & సన్సు, కర్నూలు.